E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 18-03-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:7 || పేజీలు–6
www.ekaburu.com

## ఉత్తరాలే కాదు..
## ఇక లాభాలూ డెలివరీ!




04

## శాసన సభలో
# రచ్చ రచ్చ



## అసెంబ్లీలో కేటీఆర్ వర్సెస్ మంత్రులు

- ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా విమర్శలు,ప్రతి విమర్శలు
- ధన్యవాదాలు ఎందుకు తెలపాలన్న బీఆర్ఎస్ నేత
- ప్రభుత్వానికి, సీఎం సంతకానికి జీరో వాల్యూ అంటూ ఎద్దేవా
- కేటీఆర్ ప్రసంగిస్తుండగా జోక్యం చేసుకున్న ఐదుగురు అమాత్యులు
- ప్రభుత్వ పథకాలు ప్రస్తావిస్తూ దీటుగా జవాబు.. సభను పక్కదారి పట్టిస్తున్నారంటూ ఫైర్

**ఈ-కబురు, హైదరాబాద్:**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల రెండోరోజు మంగళవారం అధికార, ప్రతిపక్ష సభ్యుల సవాళ్లు, ప్రతిసవాళ్లకు శాసనసభ వేదికైంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడే సమయంలో విపక్ష బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వర్సెస్ మంత్రులు అన్నట్టుగా సభ సాగింది. కేటీఆర్.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు చట్టబద్ధతను ప్రశ్నిస్తూ, ఆ ఆరు అంశాలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని ధ్వజమెత్తారు. కేటీఆర్‌కు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో కౌంటర్ ఇచ్చారు.

**కేటీఆర్ ప్రశ్నల వర్షం**

సుమారు 1.40 గంటల పాటు మాట్లాడిన కేటీఆర్.. గవర్నర్ ప్రసంగంలోని అంశాలతో పాటు రెండున్నరేళ్ల ప్రభుత్వ పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో ప్రభు త్వం విఫలమైనందుకు ధన్యవాదాలు తెలపాలా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రేషన్‌కార్డుల విషయంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మధ్య సమన్వయ లోపం ఉందని వ్యాఖ్యానించారు. 6 గ్యారంటీలకు చట్టబద్ధత అన్న సీఎం సంతకానికి విలువలేకుండా పోయిందని విమర్శించారు. ఎందుకు చట్టబద్ధత కల్పించలేదని ప్రశ్నించారు. దీనిపై సిట్ వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, సీఎం సంతకానికి జీరో వాల్యూ అంటూ ఎద్దేవా చేశారు.

**ప్రతి విమర్శలతో మంత్రుల ఫైర్**

కేటీఆర్ ప్రసంగానికి పలుమార్లు అడ్డుపడిన మంత్రులు.. ప్రతి విమర్శలకు దిగారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.

మిగతా 2లో

## డ్రగ్స్ పార్టీ
## గుట్టు విప్పండి



- మొయినాబాద్ కేసుపై సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ ఉత్తర్వులు
- ఫ్యూచర్‌సిటీ కమిషనర్ సుధీర్‌బాబు పర్యవేక్షణలో దర్యాప్తు
- మూడు నెలల్లో అభియోగపత్రం దాఖలుకు ఆదేశం

ఈకబురు,హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న మొయినాబాద్ మత్తు పార్టీ అసలు గుట్టును విప్పేందుకు పోలీసు శాఖ నడుం బిగించింది. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో నిర్వహించిన పార్టీలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తోపాటు మొత్తం 11 మంది పాల్గొనడం, వారంతా వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు కావడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. పైగా ఇక్కడ తరచూ డ్రగ్స్ పార్టీలను నిర్వహించేవారని పోలీసులు భావిస్తున్నారు. వీటన్నింటినీ తేల్చేందుకు మొయినాబాద్ డ్రగ్స్ పార్టీపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ శివధర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫ్యూచర్‌సిటీ కమిషనర్ సుధీర్‌బాబు పర్యవేక్షణలో పనిచేసే సిట్‌లో చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ ఎం.రవీంద్రరెడ్డి, షాద్‌నగర్ డీసీపీ సీహెచ్.శిరీష, ఈగల్ ఫోర్స్ డీఎస్పీలు సీ.హరీష్ చంద్రారెడ్డి, ఎన్.బుచ్చయ్య, మొయినాబాద్ సీఐ వై.మల్లికార్జునరెడ్డి, మోకిల, మొయినాబాద్, శంషాబాద్ రూరల్ ఎస్సైలు సి.కోటేశ్వరరావు, ఎన్.వెంకన్న, సాదత్ అలీలు సభ్యులుగా ఉంటారు. మూడు నెలల్లో దర్యాప్తు పూర్తి చేసి, అభియోగపత్రాలను దాఖలు చేయాలని డీజీపీ తన ఆదేశాల్లో స్పష్టంచేశారు.

మిగతా 2లో



3

యూఏఈపై దాడులను
## ఖండించిన మోదీ

**ఈ-కబురు,ఢిల్లీ:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై (యూఏఈ) దాడులను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. త్వరితగతిన శాంతిని నెలకొల్పడానికి, పశ్చిమాసియా భద్రత, స్థిరత్వానికి ఆ దేశంతో కలిసి పని చేసేందుకు అంగీకరించారు




3

## 74 మంది ఎమ్మెల్యేలకు షాక్
291 మందితో జంబో జాబితా

**ఈ-కబురు,కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ.. 74 మంది ఎమ్మెల్యేలకు షాకిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో వారికి టికెట్లు నిరాకరించారు. మంగళవారం 291 మందితో ప్రకటించిన జంబో జాబితాలో వారికి చోటు లభించలేదు.

## ఖర్గేతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ
### సీఎం ఢిల్లీ పర్యటనలో డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్‌ల నియామకంపై చర్చ!



02

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాజ్యసభకు నూతనంగా ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డి

ఈకబురు,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన తన మిత్రుడు వేం నరేందర్‌రెడ్డిని సీఎం వారికి పరిచయం చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు, ఎంపీలు సురేశ్ షెట్కార్, మల్లు రవి, బలరాంనాయక్‌లు పాల్గొన్నారు. ఖర్గే.. వేం నరేందర్‌రెడ్డిని అభినందించారు. ఈ భేటీలో ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షులతో ఖర్గే వర్తమాన రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు తెలిసింది.



## నాటో దేశాలు నిరాకరించాయి ట్రంప్

03



## తోపుడు బండితో అసెంబ్లీకి..

.. బీజేపీ ఎమ్మెల్యేలను అడ్డుకున్న భద్రతా సిబ్బంది

ఈ కబురు, హైదరాబాద్ ; తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ ఎమ్మెల్యేలు మంగళవారం అసెంబ్లీ వద్ద వినూత్న నిరసనకు దిగారు.

02

## ఇజ్రాయెల్ ఒత్తిడితో..
## ట్రంప్‌తప్పుదారి పట్టారు

- ఇరాన్‌తో అమెరికాకు తక్షణ ముప్పేమీ లేదు
- ఇజ్రాయెల్, అమెరికాలోని లాబీ ముప్పు ఉన్నట్లు మిమ్మల్ని నమ్మించింది

02



**వాషింగ్టన్, :** ఇరాన్‌తో అమెరికాకు ఎలాంటి తక్షణ ముప్పు లేదని.. ఇజ్రాయెల్‌తోపాటు అమెరికాలోని ఆ దేశ లాబీ ఒత్తిడితోనే యుద్ధాన్ని ప్రారంభించినట్టు స్పష్టంగా అర్థమవుతోందని అమెరికా జాతీయ ఉగ్రవాద నిరోధక కేంద్రం (ఎన్‌సీటీసీ) డైరెక్టర్ జో కెంట్ పేర్కొన్నారు. ఇరాన్‌పై యుద్ధానికి మద్దతివ్వడానికి తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, బాగా ఆలోచించిన తర్వాత తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఈ మేరకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మంగళవారం జో కెంట్ లేఖ రాశారు. దీనికి సంబంధించి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "2016, 2020, 2024 అధ్యక్ష ఎన్నికల సమయంలో మీరు ప్రచారం చేసిన విలువలు, విదేశాంగ విధానాలకు నేను మద్దతు ఇచ్చాను. మీ మొదటి టర్మ్‌లో వాటన్నింటినీ అమలు చేశారు. పశ్చిమాసియాలో యుద్ధాలు అమెరికా ప్రజల విలువైన ప్రాణాలకు, ఖజానాకు, జాతీయ సమగ్రతకు గండికొడతాయని గుర్తించారు.

## అఫ్గాన్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి



### కాబూల్‌లో 400 మందికి పైగా రోగుల మృతి

- 250 మందికి గాయాలు
- పాశవిక చర్యను తీవ్రంగా ఖండించిన భారత్
- ఉగ్రమూకలపై ఆపరేషన్‌గా సమర్థించుకున్న పాకిస్థాన్

కాబూల్/ఇస్లామాబాద్: అఫ్గానిస్థాన్‌పాకిస్థాన్‌ల మధ్య కొన్నాళ్లుగా జరుగుతున్న సైనిక ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చాయి. పాక్ సైన్యం సోమవారం రాత్రి పాశవిక చర్యకు పాల్పడింది. అఫ్గాన్ రాజధాని కాబూల్‌లోని మాదకద్రవ్య బాధితుల పునరావాస ఆస్పత్రిపై పాక్ జరిపిన వైమానిక దాడిలో 400 మందికిపైగా రోగులు ప్రాణాలు కోల్పోయారు. మరో 250 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అఫ్గాన్ ప్రభుత్వ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

కాబూల్‌లో ఉన్న 3వేల పడకల సామర్థ్యం గల ఒమిద్ అడిక్షన్ ట్రీట్మెంట్ ఆస్పత్రిపై సోమవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో వైమానిక దాడి జరిగిందని అఫ్గానిస్థాన్ ప్రభుత్వ డిప్యూటీ అధికార ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు.

మిగతా 3లో



## ఇరాన్‌కు ఎదురుదెబ్బ

- ఇజ్రాయెల్ దాడుల్లో ఇద్దరు అగ్రశ్రేణి అధికారులు మృతి
- ఖమేనీ కుడిభుజం అలీ లారిజానీ, జనరల్ సులేమానీ హతం
- ఇరాన్ నాయకత్వం వెన్నెముక విరిచేశాం
- ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ ప్రకటన
- గల్ఫ్ దేశాలపై కొనసాగిన ఇరాన్ దాడులు
- టెహ్రాన్, బీరూట్‌పై ఇజ్రాయెల్ సైన్యం దాడి

02

దుబాయ్: ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. దివంగత సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీకి కుడిభుజంగా పనిచేసిన సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లారిజానీతోపాటు ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ)కు చెందిన బసిజ్ పారామిలటరీ ఫోర్స్ కమాండర్ జనరల్ ఘోలమ్‌రెజా సులేమానీ తమ దాడుల్లో మృతి చెందినట్లు ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం వెన్నుముక విరిచేశామని వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



## EPF కనీస పెన్షన్ పెంపు.. పార్లమెంటు కమిటీ కీలక సిఫార్సులు

04

# బిసి హాస్టల్ స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలి...


శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘం సభ్యులు


శేరిలింగంపల్లి తహశీల్దార్ కు విన్నవిస్తున్న దృశ్యం

### గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ సంక్షేమ సంఘం డిమాండ్

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి మండలం గోపినగర్ లోని శేరిలింగంపల్లి మండల బిసి బాలుర వసతి గృహం స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలని గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శేరిలింగంపల్లి మండల తహసిల్దార్ మహిపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, రంగారెడ్డి జిల్లా బిసి డెవలప్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ కేశురాంలతో పాటు శేరిలింగంపల్లి తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ లకు మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. వసతి గృహం ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్న ప్రహరి నిర్మాణం చేపట్టడం లేదని సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహానికి రక్షణ లేకపోవడంతో ప్రాంగణం కబ్జాలకు గురవుతుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బాలుర వసతి గృహం స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గోపినగర్, బాపునగర్, నెహ్రూనగర్ బస్తీల వాసులు పాల్గొన్నారు.

## గౌలిదొడ్డిలో వీధికుక్కలను పట్టుకొని
# వాక్సినేషన్ సెంటర్ కు తరలింపు

### ప్రజావాణి పిర్యాదుపై స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు : రాగం హరిశంకర్ యాదవ్


గౌలిదొడ్డి పరిసరాల్లో వీధి కుక్కలను పట్టుకుంటున్న సిఎంసి సిబ్బంది


గౌలిదొడ్డి పరిసరాల్లో వీధి కుక్కలను పట్టుకుంటున్న సిఎంసి సిబ్బంది

ఈకబురు, శేరిలింగంపల్లి : నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్యలపై స్పందించిన అధికారులు మంగళవారం వీధి కుక్కలను పట్టుకుని వాక్సినేషన్ సెంటర్ కు తరలించారు. గౌలిదొడ్డి ప్రాంతంలోని పుక్కట్ నగర్, కేశవ్ నగర్, జయభేరి, పద్మశ్రీ గార్డెన్ తదితర ప్రాంతాల్లో ప్రజలు గత కొంతకాలంగా వీధి కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం హరిశంకర్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సోమవారం శేరిలింగంపల్లి జోనల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులను కలిసిన హరిశంకర్ యాదవ్ వీధి కుక్కల సమస్యపై ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అధికారులు మంగళవారం గౌలిదొడ్డి పరిసరాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వీధుల్లో తిరుగుతున్న వీధి కుక్కలను పట్టుకొని వాక్సినేషన్ సెంటర్కు తరలించారు. ఈ సందర్భంగా రాగం హరిశంకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వీధి కుక్కల కారణంగా చిన్నపిల్లలు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

# అఫ్గాన్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి

ఆసుపత్రిలోని 5 బ్లాకులు పూర్తిగా ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలైన వారికి చికిత్స అందించే ప్రత్యేక కేంద్రంగా ఈ ఆస్పత్రి పనిచేస్తోంది. భారీ సంఖ్యలో రోగులు, వైద్య సిబ్బంది అక్కడ ఉంటారని, అందువల్లే అధిక ప్రాణనష్టం జరిగిందని అధికారులు తెలిపారు. వైమానిక దాడి ఘటనపై అఫ్గానిస్థాన్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ దేశంలోని పౌర నివాసాలపై కొన్నాళ్లుగా విరుచుకుపడుతున్న పాక్ సైన్యం ఇప్పుడు ఆస్పత్రిని లక్ష్యంగా చేసుకుందని ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణలను పాకిస్థాన్ తోసిపుచ్చింది. అఫ్గానిస్థాన్‌లోని ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలు, ఆయుధ నిల్వ కేంద్రాల లక్ష్యంగా మాత్రమే దాడి చేసినట్లు తెలిపింది. అత్యంత కచ్చితత్వంతో వాటిని ధ్వంసం చేసినట్లు సమర్థించుకుంది. తాలిబన్ ప్రభుత్వం పెంచిపోషిస్తోన్న ఉగ్రమూకలపై తాము చేపట్టిన 'ఆపరేషన్ ఘజబ్ లిల్ హఖ్'లో భాగంగానే వైమానిక దాడులు చేసినట్లు ప్రకటించింది. పాకిస్థాన్ ఘోరకృత్యంపై అంతర్జాతీయంగా కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. పౌరుల ప్రాణనష్టం ఘటన తీవ్రంగా కలచివేసిందని అఫ్గానిస్థాన్‌లో మానవ హక్కుల ప్రత్యేక ప్రతినిధిగా ఉన్న రిచర్డ్ బెన్నెట్ తెలిపారు. ఆస్పత్రులు, విద్యాసంస్థలు వంటి పౌర సదుపాయాలను లక్ష్యం చేసుకోవడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని గుర్తు చేశారు.

**పాక్‌ను జవాబుదారీగా చేయాలి: భారత్**

కాబూల్ ఆస్పత్రిపై దాడి అనాగరికమంటూ భారత్ తీవ్రంగా ఖండించింది. పౌరుల ప్రాణాలను బలిగొనడం అమానవీయ, హేయమైన చర్య అని మండిపడింది. ఈ మారణహోమాన్ని సైనిక ఆపరేషన్‌గా చిత్రీకరించేందుకు పాకిస్థాన్ యత్నిస్తోందని భారత విదేశీవ్యవహారాల శాఖ విమర్శించింది. అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడిగా అభివర్ణించింది. పాక్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలని డిమాండ్ చేసింది. అఫ్గాన్ ప్రజలకు సంఘీభావం ప్రకటించింది. పవిత్ర రంజాన్ మాసంలో ఇలాంటి దాడులు దారుణమని విచారం వ్యక్తం చేసింది. పాకిస్థాన్ వైమానిక దాడులను ఐక్యరాజ్య సమితి వేదికపై కూడా భారత్ తీవ్రంగా ఖండించింది.

# 74 మంది ఎమ్మెల్యేలకు షాక్

**భవానీపుర్‌లో అసెంబ్లీ ప్రతిపక్ష నేత (భాజపా) సువేందు అధికారితో మమతా బెనర్జీ తలపడనున్నారు. కాళీఘాట్‌లోని తన నివాసంలో ఆమె అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవడానికి, పాత కొత్తల కలయికకు, సంస్థాపరమైన సమతుల్యతకు, భాజపా దూకుడుకు అడ్డుకట్ట వేయడానికి మమత ప్రాధాన్యమిచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. మొత్తం 294 స్థానాల్లో 291 చోట్ల తాము పోటీ చేస్తున్నామని, మిగిలిన 3 సీట్లను డార్జిలింగ్ హిల్స్‌లోని భారతీయ గూర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చాకు కేటాయించామని తెలిపారు.**

**పార్టీకున్న 224 మంది ఎమ్మెల్యేల్లో 135 మందికి మళ్లీ టికెట్లు దక్కాయి. 15 మంది సీట్లు మారాయి. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో తనను ఓడించిన సువేందు అధికారిపైనే మమత మళ్లీ పోటీకి దిగారు. అయితే ఈసారి వారిద్దరూ భవానీపుర్‌లో తలపడుతున్నారు. నందిగ్రామ్‌లో పవిత్ర కర్‌కు టికెట్టు ఇచ్చారు. అక్కడ సువేందు అధికారే పోటీ చేస్తున్నారు.**

**టికెట్లు దక్కిన వారిలో యువ నేతలు, వృత్తి నిపుణులు, ప్రముఖులు ఉన్నారు. అయితే ఈసారి సెలబ్రిటీల కంటే బలమైన అభ్యర్థులకే పార్టీ ప్రాధాన్యమిచ్చింది.**

**రాజ్‌గంజ్ నుంచి ఒలింపియన్, ఆసియా క్రీడల బంగారు పతక విజేత స్వప్న బర్మన్, తుఫాన్‌గంజ్ నుంచి మాజీ క్రికెటర్ శివ్ శంకర్ పాల్ బరిలో నిలిచారు.**

**291 మంది అభ్యర్థుల్లో 239 మంది పురుషులు (82శాతం), 52 మంది మహిళలు (18శాతం).**

**149 మంది జనరల్, ఓబీసీ వర్గాలకు చెందినవారు. 78 మంది ఎస్సీలు, 17 మంది ఎస్టీలున్నారు. 11 అన్‌రిజర్వుడ్ సీట్లలో ఎస్సీలను మమత బరిలో దించారు.**

## యూఏఈపై దాడులను ఖండించిన మోదీ



మంగళవారం యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. హర్మూజ్ జల సంధి మీదుగా సురక్షిత, స్వేచ్ఛాయుత నౌకాయానానికి కలిసి పని చేయాలని ఇద్దరు నేతలు అంగీకరించాయి. పశ్చిమాసియా పరిస్థితిపై చర్చించారు. 'నా సోదరుడు నహ్యాన్‌తో మాట్లాడా. ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపా. పశ్చిమాసియా పరిస్థితిపై ఆయనతో చర్చించా. యూఏఈపై దాడులను అన్ని రకాల దాడులను భారత్ ఖండిస్తుందని చెప్పా. వాటివల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. మౌలిక వసతులు దెబ్బతిన్నాయి' అని ఎక్స్‌లో మోదీ పేర్కొన్నారు.

యుద్ధ విధ్వంస శాటిలైట్ చిత్రాల విడుదల

దుబాయ్: అమెరికాఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధానికి సంబంధించిన విధ్వంస శాటిలైట్ చిత్రాలు విడుదలవుతున్నాయి. ఇప్పటిదాకా గల్ఫ్ దేశాల్లో జరిగిన విధ్వంసానికి సంబంధించిన వివరాలు పెద్దగా వెల్లడికాలేదు. తాజాగా విడుదల చేసిన చిత్రాల్లో విధ్వంస ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ చిత్రాల్లో..

ఇరాన్ బందర్ అబ్బాస్ పోర్టులోని నౌకలు మంటల్లో కాలిపోయాయి.

బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరమైన 5వ ఫ్లీట్ లో భారీ విధ్వంసం జరిగింది.

అబుధాబీలోని ఫ్రాన్స్ నౌకాదళ స్థావరం దెబ్బతింది. అందులోని రెండు హ్యాంగర్లు ధ్వంసమయ్యాయి.

దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా మంటలు చెలరేగాయి.

ఒమన్‌లోని సలాలా పోర్టులో మంటలు చెలరేగిన దృశ్యాలూ శాటిలైట్ చిత్రాల్లో కనిపించాయి.

## నాటో దేశాలు నిరాకరించాయి: ట్రంప్

వాషింగ్టన్: హర్మూజ్ జల సంధికి యుద్ధ నౌకలను పంపడానికి నాటోతోపాటు మిత్ర దేశాలు నిరాకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అయితే ఇరాన్ విషయంలో తాము చేస్తున్న యుద్ధాన్ని దాదాపు అన్ని దేశాలు సమర్థించాయని స్పష్టం చేశారు. ఇరాన్‌పై యుద్ధం మీద దృష్టి సారించేందుకు వీలుగా తన చైనా పర్యటనను వచ్చే నెలకు వాయిదా వేసుకుంటున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నెల ఆఖరుకు బదులుగా ఐదారు వారాల్లో చైనాకు వెళ్తానని మంగళవారం ఆయన వెల్లడించారు. ఇరాన్ యుద్ధంపై తమను ఎవరూ సంప్రదించలేదని, తాము ఎటువంటి ఆపరేషన్లలో పాల్గొనబోమని కెనడా స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గాలనేదే తమ ప్రాధాన్యాంశమని ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి అనితా ఆనంద్ తెలిపారు. ప్రస్తుతం ఆమె తుర్కియే పర్యటనలో ఉన్నారు.

## ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో
# ఉగాది కవి సమ్మేళనం

### పరాభవం భయం వద్దు... ఒక్కోసారి అవమానం కూడా బహుమానమే : హాస్యబ్రహ్మ శంకరనారాయణ


కవి సమ్మేళనంలో ప్రసంగిస్తున్న హాస్యబ్రహ్మ శంకరనారాయణ


కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులతో రామస్వామి యాదవ్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి : "" మన్మధనామ సంవత్సరములో అందరూ మన్మధులయ్యారా...? రాక్షసనామ సంవత్సరములో అందరూ రాక్షసులయ్యారా..? పేరులో ఏముంది పెన్నిధి... పరాభవం భయం వద్దు... పరాభవనామ సంవత్సరంలో అన్నీ పరాభవాలే జరుగుతాయని భయపడాల్సిన అవసరం లేదు... ఒక్కోసారి అవమానము కూడా ఒక బహుమానమే అవుతుంది... అంటూ హాస్యబ్రహ్మ శంకరనారాయణ ప్రసంగం యావత్తు ఛలోక్తులు, చమత్కారాలతో హాస్యభరితంగా సాగింది.""**

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని చందానగర్ లో గల శ్రీ విశాఖ శారదాపీఠ పాలిత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కవి సమ్మేళనాన్ని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సుదర్శన సత్యసాయి జ్యోతి ప్రదీపనము చేసి ప్రారంభించారు. ఈ కవి సమ్మేళనానికి కళాసింధు డాక్టర్ ఆలపాటి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాస్యబ్రహ్మ, పాత్రికేయులు డాక్టర్ శంకర నారాయణ హాజరయ్యారు. అతిథులుగా చిత్రకవితా సామ్రాట్ చింతా రామకృష్ణారావు, వివిఎస్ఆర్. సోమయాజులు, ఆర్కిటెక్ట్ ఎండూరి సురేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలను నిర్వహించడం అనాదిగా వస్తున్న సనాతన సాంప్రదాయమని అన్నారు. ఉగాది నక్షత్ర గమనానికి ప్రతీక అని, తన ఊహాశక్తి, కల్పనాశక్తులనే మనోనేత్రాలతో దేనినైనా దర్శించి ముగ్ధ మనోహరముగా, సరళంగా, భావయుక్తంగా, వచన, పద్యరూపాలలో వెల్లడించే వాడే కవి అని అన్నారు. ఈ వసంతంలో మావిచిగురు తిన్న కోయిల ఎలా హృద్యంగా కూస్తూ ఉంటుందో కవి కూడా నిరంతరము రసాత్మకమైన తన కవితాగానంతో అందరిని ఆనందడోలికలలో మంచెత్తుతూ హృదయాలను పరవశింపజేస్తుంటాడని తెలిపారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధులైన కవికోకిలలు 50 మంది తమ కవితా మాధుర్యాన్ని పంచిపెట్టి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. ఆర్కిటెక్ట్ ఎండూరి సురేష్ బాబు సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవాలయ పాలకమండలి సభ్యులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విజయలక్ష్మి, వాణి సాంబశివరావు, ఉమా చంద్రశేఖర్, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, జనార్ధన్, జీవీ రావు, జిల్ మల్లేష్, నందూరి వెంకటేశ్వర రాజు, శివరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 76,000 పైకి సెన్సెక్స్

**రెండో రోజూ లాభాల్లో సూచీలు**
**రూ.2.73 లక్షల కోట్ల సంపద వృద్ధి**



ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ మంగళవారం ఒక దశలో 801 పాయింట్లు ఎగబాకి 76,304 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 567.99 పాయింట్ల లాభంతో 76,070.84 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 172.35 పాయింట్ల వృద్ధితో 23,581.15 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో మదుపరులు లోహ, వాహన రంగ షేర్లలో కొనుగోళ్లు పెంచడం ఇందుకు దోహదపడింది. దాంతో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.73 లక్షల కోట్లు పెరిగి రూ.433.30 లక్షల కోట్లకు (4.69 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 21 లాభపడగా.. ఎటర్నల్ షేరు 5.70 ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

భారత కరెన్సీ సరికొత్త కనిష్ఠానికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 12 పైసలు నష్టపోయి రూ.92.40 వద్ద ముగిసింది.

విలువైన లోహాల ధరలు పెరిగాయి. కిలో వెండి రూ.6,000 పెరుగుదలతో రూ.2,62,500కు చేరుకోగా.. 10 గ్రాముల మేలిమి బంగారం రూ.1,050 ఎగబాకి రూ.1,61,300 ధర పలికింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 5,003 డాలర్లు, సిల్వర్ 80.46 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి. టాటా స్టీల్‌లో ఎన్ఐఎన్ఎల్ విలీనం: ప్రైవేట్ రంగ ఉక్కు ఉత్పత్తి దిగ్గజం టాటా స్టీల్‌లో నీలాంచల్ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఎన్ఐఎన్ఎల్) విలీనం కానుంది. ఈ ప్రతిపాదనకు టాటా స్టీల్ బోర్డు మంగళవారం ఆమోదం తెలిపింది. అలాగే, టాటా స్టీల్ పూర్తి అనుబంధ విభాగమైన టీ స్టీల్ హోల్డింగ్స్ పీటీఈలో 200 కోట్ల డాలర్ల (రూ.18,488 కోట్లు) పెట్టుబడులకూ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

## EPF కనీస పెన్షన్ పెంపు..
## పార్లమెంటు కమిటీ కీలక సిఫార్సులు

ఈపీఎఫ్ చందాదారులు రిటైర్మెంట్ తర్వాత పొందే పెన్షన్‌కు సంబంధించి పార్లమెంటరీ ప్యానెల్ కేంద్రానికి కీలక ప్రతిపాదనలు చేసింది. ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్, 1995 (EPS, 1995) కింద.. ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.1000 కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని కమిటీ సూచించింది. ఆ మొత్తం వాస్తవికంగా, గౌరవప్రదంగా ఉండాలని అభిప్రాయపడింది. ఈ మేరకు లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 15వ నివేదికలో పలు అంశాలను ప్రస్తావించింది. ఈపీఎస్ కనీస పెన్షన్ పెంచాలని పెన్షనర్లు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత పరిస్థితుల్లో ఇప్పుడు అందుతున్న మొత్తం ఏమాత్రం సరిపోవడం లేదని, దాన్ని రూ.7,500కు పెంచాలని వారు కోరుతున్నారు. ఇదే డిమాండ్ ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మూడు రోజుల పాటు ధర్నా నిర్వహించారు. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ స్థాయీ సంఘం స్పందించింది. కనీస పెన్షన్‌పై ఇప్పటికే పెన్షనర్ల నుంచి పలు విజ్ఞాపనలు వచ్చినట్లు పేర్కొంది. ద్రవ్యోల్బణం, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, జీవన వ్యయాలు పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న కనీస మొత్తం ఏమాత్రం సరిపోదని కమిటీ అభిప్రాయపడింది. కాబట్టి ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్, 1995ని పునః సమీక్షించి పెన్షన్ మొత్తాన్ని పెంచాలని ప్రతిపాదించింది. ఇందుకోసం కేటాయింపులు చేయాలని సూచించింది.

# ఉత్తరాలే కాదు..
# ఇక లాభాలూ డెలివరీ!

- పోస్టాఫీసులే ఇప్పుడు మ్యూచువల్ ఫండ్ కేంద్రాలు
- పల్లెల్లోనూ ఇన్వెస్ట్‌మెంట్ జాతర
- మండలాలకూ మల్టీ బ్యాగర్ చాన్స్
- భారత తపాలా శాఖ, యాంఫీ మధ్య చారిత్రక ఒప్పందం
- 50 కోట్ల మంది కొత్త ఇన్వెస్టర్లే లక్ష్యం
- మహారాష్ట్రలో సక్సెస్.. త్వరలో దేశవ్యాప్తంగా విస్తరణ




చిన్న పొదుపులు ఇపుడు పెద్ద పెట్టుబడుల దిశగా అడుగులు వేయనున్నాయి. పెట్టుబడుల్లో కొత్త అధ్యాయానికి తపాలా శాఖ శ్రీకారం చుట్టింది. ఇకపై మీ ఇంటి పక్కన ఉండే పోస్టాఫీసు కేవలం ఉత్తరాలు, సేవింగ్స్ ఖాతాలకు మాత్రమే పరిమితం కాదు. స్టాక్ మార్కెట్ లాభాలను సామాన్యులకు అందించేలా మ్యూచువల్ ఫండ్స్ అమ్మకానికి సిద్ధమవుతోంది. భారత తపాలా శాఖ, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) చేతులు కలపడంతో దేశవ్యాప్తంగా పెట్టుబడుల విప్లవం రాబోతోంది. పోస్ట్ ఆఫీసుల విస్తృత నెట్‌వర్క్‌తో మ్యూచువల్ ఫండ్లు గ్రామీణ ప్రాంతాలతో పాటు, మారు మూల పల్లెలకూ చేరే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన పెంచి, సామాన్యుడిని కూడా కోటీశ్వరుడిని చేయాలనే సంకల్పంతో పోస్టాఫీసుల ద్వారా ఈ పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు యాంఫి సీఈఓ వెంకట్ చలసాని చెప్పారు. పోస్ట్ ఆఫీసుల నెట్‌వర్క్‌తో మ్యూచువల్ ఫండ్లు మెట్రోల నుంచి మండలాలు, పల్లెలోకి అడుగు పెడుతున్నాయి. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల్లో మహారాష్ట్రే దేశంలో అగ్రస్థానంలో ఉంది దేశ మొత్తం ఫండ్ ఆస్తుల్లో 40శాతానికి పైగా వాటా ముంబై, పుణె నగరాలదే. దీంతో మహారాష్ట్రలోని ముంబై, పూణె, నాగపూర్, ఔరంగాబాద్ చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా తపాలాశాఖ మ్యూచువల్ ఫండ్స్ విక్రయానికి తెరతీసింది. అది విజయవంతం కావడంతో మరిన్ని రాష్ట్రాలకు విస్తరించేందుకు కసరత్తు ప్రారంభించింది. రెండో దశలో పంజాబ్, హరియాణా రాష్ట్రాలను ఎంపిక చేసింది. దేశవ్యాప్తంగా పదివేల మంది పోస్టల్ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఎంపిక చేసిన సిబ్బందికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ శిక్షణ ఇస్తుంది. సర్టిఫై అయిన ఉద్యోగులు పోస్టాఫీసుల ద్వారా మ్యూచువల్ ఫండ్ స్కీములను విక్రయిస్తారు. యాంఫి డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరిస్తుంది.

**చిన్న పట్టణాలపై ఫోకస్**

దేశంలోని మొత్తం మ్యూచువల్ ఫండ్ ఆస్తుల్లో 80 శాతం టాప్ 10 నగరాల నుంచే వస్తున్నాయి. 65 శాతం మందికి అవగాహన ఉన్నా, కేవలం 7 శాతం మాత్రమే అంటే 6 కోట్ల మందే పెట్టుబడి పెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల, పల్లెలదాకా విస్తరిస్తే వారి సంఖ్య 50 కోట్లకు పెరుగుతుందని యాంఫి అంచనా వేస్తోంది.

**బడ్జెట్ బూస్ట్**

ఒక్కో కొత్త ఇన్వెస్టర్‌కు రూ2,000 ప్రోత్సాహకం 2026 బడ్జెట్‌లో ప్రతి కొత్త మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్‌కు రూ2,000 ప్రోత్సాహకాన్ని ఆర్థిక మంత్రి ప్రకటించారు. పోస్టల్ సిబ్బందికి ఈ ప్రోత్సాహకంలో భాగస్వామ్యం కల్పించే విధానాన్ని తపాలాశాఖ రూపొందిస్తోంది. ఇది వారి రెగ్యులర్ కమిషన్‌కు అదనంగా ఉంటుంది. 2025 ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందం 2028 ఆగస్టు వరకు మూడేళ్ల పాటు ఉంటుందని యాంఫి వెల్లడించింది.



## సాయి పేరెంటరల్స్ @ రూ. 372–392

**ఈ నెల 24–27 మధ్య పబ్లిక్ ఇష్యూ**

హైదరాబాద్: డైవర్సిఫైడ్ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ల కంపెనీ సాయి పేరెంటరల్స్ పబ్లిక్ ఇష్యూకి తాజాగా రూ. 372–392 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 24న ప్రారంభమై 27న ముగియనుంది. దీనిలో భాగంగా హైదరాబాద్ కంపెనీ రూ. 285 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 32 లక్షల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్ట్‌కానున్నాయి.

కంపెనీ వృద్ధి ప్రయాణంలో ఐపీవో కీలక మైలురాయిగా కంపెనీ చైర్మన్, ఎండీ అనిల్ కేకే పేర్కొన్నారు. తాము సాధించిన పురోగతిని ఇది ప్రతిబింబిస్తున్నట్లు తెలియజేశారు. వ్యూహాత్మక ప్రణాళికలను వేగవంతం చేసేందుకు తోడ్పాటునివ్వగలదని పేర్కొన్నారు. తద్వారా తదుపరి విస్తరణ దశకు మద్దతు లభించనున్నట్లు తెలియజేశారు. ప్రధానంగా గ్లోబల్ ఫార్ములేషన్ల బిజినెస్‌తోపాటు.. ఇంజెక్టబుల్స్, ఓరల్ డోసేజీ ఫార్ములేషన్లలో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, తయారీ సామర్థ్యాలను విస్తరించేందుకు వీలు చిక్కనున్నట్లు వివరించారు.

## బీవైడీ సీలియన్ కొత్త ఎడిషన్: ధర, వివరాలు

బీవైడీ కంపెనీ భారతదేశంలో తన సీలియన్ 7 కారును లాంచ్ చేసి ఏడాది కాలం అయింది. ఈ సందర్భంగా సంస్థ ఫస్ట్ యానివర్సరీ ఎడిషన్‌ను లాంచ్ చేసింది. దీనికోసం బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. రూ.70000 చెల్లించి బుక్ చేసుకోవచ్చని బీవైడీ వెల్లడించింది. బీవైడీ సీలియన్ 7 యానివర్సరీ ఎడిషన్ ప్రీమియం, పెర్ఫామెన్స్ అనే రెండు వేరియంట్లలో లభిస్తుంది. టాప్‌స్పెక్ పెర్ఫార్మెన్స్ వేరియంట్ కేవలం 4.5 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు, కాగా ప్రీమియం వెర్షన్ అదే వేగాన్ని 6.7 సెకన్లలో అందుకుంటుంది. రెండు వేరియంట్లు 82.56 kWh బ్యాటరీ ప్యాక్ పొందినప్పటికీ.. NEDC ప్రమాణాల ప్రకారం, పెర్ఫార్మెన్స్ మోడల్ డ్రైవింగ్ రేంజ్ 542 కిలోమీటర్లు కాగా.. ప్రీమియం వేరియంట్ 567 కిలోమీటర్ల రేంజ్ అందిస్తుంది. బీవైడీ సీలియన్ 7 యానివర్సరీ ఎడిషన్ ప్రీమియం, పెర్ఫామెన్స్ ధరలు వరుసగా.. రూ. 49.40 లక్షలు, రూ. 54.90 లక్షలు (ఎక్స్ షోరూమ్). ముందు బుక్ చేసుకున్న 1100 మందికి ఇన్‌స్టాలేషన్‌తో పాటు 11 kW హోమ్ ఛార్జర్‌ను ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా అందిస్తారు. అంతేకాకుండా, ఈ ప్యాకేజీలో రెండు సంవత్సరాల ఉచిత సర్వీస్ మరియు మెయింటెనెన్స్ కూడా లభిస్తాయి.

## ఫార్మాపైనా యుద్ధ మేఘాలు

- ముడి పదార్థాల సరఫరాకు అడ్డంకులు
- కృత్రిమ కొరతతో ధరల పెంపు
- కొండెక్కిన ఉత్పత్తి వ్యయాలు



పశ్చిమాసియా యుద్ధం దేశీయ ఫార్మా పరిశ్రమను కలవర పెడుతోంది. ఈ యుద్ధంతో ముడి చమురు నుంచి తయారు చేసే ఫార్మా ప్రధాన ముడి పదార్థాలైన బెంజిన్, టొల్యూన్, ఇథిలిన్ వంటి పెట్రో రసాయనాల సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆస్పిరిన్, పారాసిటమాల్, పెన్సిలిన్, యాంటీబయాటిక్స్, యాంటీహిస్టామైన్స్, సెడేటివ్స్ వంటి నిత్యావసర ఔషధాల తయారీకి ఈ పెట్రో రసాయనాలు కీలకం. ప్రస్తుతం దేశంలో వీటి నిల్వలు రెండు మూడు నెలల అవసరాలకు మించి లేవు. ఈ ఉద్రిక్తతలు ఎక్కువ రోజులు కొనసాగితే చైనా నుంచి సరఫరా అయ్యే యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) సరఫరాకీ కొరత తప్పదని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**కృత్రిమ కొరత**


సందట్లో సడేమియాలా ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకుని ఈ పెట్రో రసాయనాలను ఫార్మా కంపెనీలకు సరఫరా చేసే కంపెనీలు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేశాయి. దీంతో ఫార్మా కంపెనీల ఉత్పత్తి వ్యయాలు పెరిగిపోయాయి. ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు నిత్యావసర ఔషధాల ధరలు పెంచేందుకు అనుమతించాలని ఫార్మా కంపెనీలు ప్రభుత్వాన్ని కోరాయి. వ్యాధి నిర్ధారణ పరికరాల్లో ఉపయోగించే ప్లాస్టిక్ విడి భాగాల ధరలైతే గత రెండు వారాల్లో దాదాపు 50 శాతం పెరిగాయి. సిరంజీలు, క్యాథెటెర్స్ వంటి వాటి తయారీ కోసం ఉపయోగిస్తున్న పీఎన్‌జీ గ్యాస్ ధర పెరగటం కూడా ఇందుకు కారణంగా ఉంది.

మూడింతలు పెరిగిన రవాణా చార్జీలు మన దేశం నుంచి పెద్ద మొత్తంలో జెనరిక్ ఔషధాలు, వ్యాక్సిన్లు అమెరికా, యూరప్, ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాలకు ఎగుమతవుతాయి. అతితక్కువ లాభాలతోనే మన కంపెనీలు ఈ దేశాలకు నాణ్యమైన జెనరిక్ ఔషధాలు ఎగుమతి చేస్తున్నాయి. ప్రస్తుత ఉద్రిక్తతలతో ఉత్పత్తి వ్యయాలతో పాటు రవాణా ఖర్చు లు భారీగా పెరిగిపోయాయి. తాజా ఉద్రిక్తతల తో అమెరికా, యూరప్ దేశాలకు జరిగే నౌకా రవాణా ఎర్ర సముద్రం, హోర్ముజ్ జలసంధికి బదులు కేప్ ఆఫ్ గుడ్ హోప్ నుంచి వెళ్లాల్సి వస్తోంది. దీంతో కంటైనర్ చార్జీలు రెండు మూడు రెట్లు, విమాన రవాణా చార్జీలు 15 నుంచి 30 శాతం వరకు పెరిగాయి. రవాణా సమయం కూడా 1015 రోజులు అదనంగా పెరిగింది.

**ప్రభుత్వమే ఆదుకోవాలి**

దీంతో కాంట్రాక్టు ప్రకారం పాత ధరలతో ఈ ఔషదాలు ఎగుమతి చేస్తే నష్టాలు తప్ప లాభాలు మిగిలే అవకాశం లేదని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాన ముడి పదార్థాల ధరలను నియంత్రించడంతో పాటు పెరిగిన నౌకా, విమాన రవాణ చార్జీల్లో కొంత ప్రభుత్వం సబ్సిడీ రూపంలో భరిస్తే తప్ప ప్రస్తుత పరిస్థితి నుంచి గట్టెక్కే మార్గం లేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

## ఏటా రూ.2 లక్షల కోట్లు!




దేశంలో మౌలిక వసతులపై అదానీ పెట్టుబడులు

దేశంలో మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ఏటా రూ.2 లక్షల కోట్ల చొప్పున వచ్చే అయిదేళ్ల పాటు పెట్టుబడులు పెడుతున్నట్లు అదానీ గ్రూప్ వెల్లడించింది. ఇంధన భద్రత కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని, తద్వారా భౌగోళిక రాజకీయ అనిశ్చితుల ప్రభావం మనదేశంపై తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొంది. 'అంతర్జాతీయ అనిశ్చితుల వల్ల, ఇంధన ధరలు ఉన్నట్లుండి పెరుగుతున్నాయి. అందుకే ఈ విషయంలో స్వయం సమృద్ధి తప్పనిసరి అవసరంగా మారిందని దేశాలు గుర్తిస్తున్నాయ'ని అదానీ గ్రూప్ వివరించింది. ఇంధనం, లాజిస్టిక్స్ మౌలిక ఆస్తులను బలోపేతం చేసుకుంటే అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావం పెద్దగా పడదని పేర్కొంది.

ఏ వసతులపై ఎంత పెట్టుబడులంటే..: దేశ ముడిచమురు అవసరాల్లో 88%, సహజ వాయువు అవసరాల్లో 50% దిగుమతులే తీరుస్తున్నాయి. ఈ సమస్య తగ్గాలంటే, 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని మనదేశం లక్ష్యంగా చేసుకుంది. ఇందులో 10 శాతాన్ని అందించాలని అదానీ గ్రూప్ భావిస్తోంది. 2030 కల్లా 50 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించేందుకు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపింది. విద్యుత్తు ఉత్పత్తితో పాటు సరఫరా కూడా కీలక అంశమే. అందువల్ల హైఓల్టేజీ ట్రాన్స్‌మిషన్ వసతులపై రూ.1.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాలని అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ భావిస్తోంది. సంప్రదాయ వనరుల నుంచి పూర్తిగా మారడం కంటే, సమతౌల్య ఇంధన మిశ్రమాన్ని కలిగి ఉండడం మంచిదని అదానీ పోర్ట్స్ అండ్ ఎస్ఈజెడ్ ఎండీ కరణ్ అదానీ అంటున్నారు. సౌర, పవన, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, స్వచ్ఛ బొగ్గు వంటి మిశ్రమం భారత్‌కు అవసరమన్నారు. 24 గంటల విద్యుత్ లభ్యత నిమిత్తం 42 గిగావాట్ల బేస్‌లోడ్ విద్యుత్ సామర్థ్యాన్ని రూ.2 లక్షల కోట్లతో నిర్మించనుంది. దీంతో మొత్తం ఇంధన పోర్ట్‌ఫోలియో 90 గిగావాట్లకు చేరుతుంది. అదానీ గ్రూప్ ప్రస్తుతం 15 నౌకాశ్రయాలు, 12 లాజిస్టిక్ పార్కులు నిర్వహిస్తోంది. ఇందులో కొన్ని విదేశీ పోర్టులూ ఉన్నాయి. వీటి సామర్థ్యాన్ని 600 మిలియన్ మెట్రిక్ టన్నుల నుంచి రెట్టింపు చేసి 1200 ఎంఎంటీ చేసేందుకు చూస్తోంది. విమానాశ్రయాల వార్షిక సామర్థ్యాన్ని 2030 కల్లా ప్రస్తుతం కంటే రెట్టింపు చేసి, 20 కోట్ల మంది ప్రయాణికులకు అనువుగా తీర్చిదిద్దాలని భావిస్తోంది. 2028 నాటికి సిమెంటు ఉత్పత్తి సామర్థ్యాన్ని 155 ఎంటీపీఏకు, డేటా సెంటర్ల సామర్థ్యాన్ని 2030 కల్లా 1 గిగావాట్‌కు చేర్చాలన్నది సంస్థ ప్రణాళిక.

## ఎయిరిండియా విమానాలన్నీ రంగంలోకి

తమ ఆధీనంలోని విమానాలన్నీ కార్యకలాపాలకు సిద్ధమైనట్లు టాటా గ్రూప్ సంస్థ ఎయిరిండియా వెల్లడించింది. 2020 ఫిబ్రవరి నుంచి నిలిపి ఉంచిన బోయింగ్ 777300ఈఆర్ విమానం కూడా అందుబాటులోకి వచ్చినట్లు తెలిపింది. దీనితో కలిపి, కార్యకలాపాలు సాగించకుండా నిలిపి ఉంచిన మొత్తం 30 విమానాలను మళ్లీ వినియోగంలోకి తెచ్చినట్లు వివరించింది. 2022లో ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను టాటా గ్రూప్ స్వాధీనం చేసుకున్నాక, పాత విమానాల నవీకరణ ప్రక్రియను చేపట్టింది. ఇప్పటికి పూర్తయ్యింది.

**జియో నుంచి యూపీఐ**
## క్యాష్ విత్‌డ్రా సేవలు




దిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ అనుబంధ సంస్థ జియో పేమెంట్స్ బ్యాంక్ సరికొత్తగా యూపీఐ ఆధారిత నగదు ఉపసంహరణ సేవలను ప్రారంభించింది. టచ్ పాయింట్ల వద్ద తన బిజినెస్ కరెస్పాండెంట్ల ద్వారా చేపట్టిన ఈ సేవలు డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేసేందుకు వేసిన ప్రధాన అడుగుగా చెబుతోంది. ముఖ్యంగా గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లోని వినియోగదార్లు తమ యూపీఐ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, నగదును విత్‌డ్రా చేసుకోవచ్చని తెలిపింది. ఇందుకు డెబిట్ కార్డులు - ఏటీఎం అవసరం ఉండదని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేర్కొంది.

# మళ్లీ మార్కెట్లోకి రెనో డస్టర్

**ఫ్రెంచి కార్ల దిగ్గజం రెనో.. మిడ్‌సైజ్ ఎస్‌యూవీ డస్టర్‌ను సరికొత్త ముస్తాబులతో మార్కెట్లో తిరిగి ప్రవేశపెట్టింది. ఢిల్లీలో కారు ప్రారంభ ధర రూ.10.49 లక్షలు...**




న్యూఢిల్లీ: ఫ్రెంచి కార్ల దిగ్గజం రెనో.. మిడ్‌సైజ్ ఎస్‌యూవీ డస్టర్‌ను సరికొత్త ముస్తాబులతో మార్కెట్లో తిరిగి ప్రవేశపెట్టింది. ఢిల్లీలో కారు ప్రారంభ ధర రూ.10.49 లక్షలు. ప్రస్తుతం కంపెనీ పోర్టుఫోలియోలో క్విడ్, ట్రైబర్, కైగర్ ఉన్నాయి. మారుతి గ్రాండ్ విటారా, కియా సెల్టోస్, హ్యుండయ్ క్రెటా, టాటా సియెర్రాలకు డస్టర్ గట్టి పోటీనిస్తుందని అంచనా. ఈ కారు తయారీలో పూర్తిగా 90 శాతానికి పైబడి స్థానికంగా తయారైన విడిభాగాలే వినియోగించినట్టు కంపెనీ తెలిపింది. ఆరు గేర్లతో ఆటోమేటిక్, మాన్యువల్ వెర్షన్లు రెండింటిలోనూ ఈ కారు అందుబాటులో ఉంటుంది.

# యాక్షన్ షురూ




సినిమా పట్టాలెక్కడమే ఆలస్యం... మెరుపు వేగంతో చిత్రీకరణను ముందుకు నడిపిస్తుంటారు అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ. ఇటీవలే మొదలైన ఆయన కొత్త చిత్రం పరుగులు పెడుతోంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఆ చిత్రం తెరకెక్కుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో యాక్షన్ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో బాలకృష్ణతోపాటు, ఇతర తారాగణం పాల్గొంటున్నారు. విజయవంతమైన 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా నయనతార నటించనున్నట్టు తెలిసింది.

కీలకమైన ఓ పాత్ర కోసం మంచు మనోజ్‌నీ సంప్రదించినట్టు తెలుస్తోంది. ఇది బాలకృష్ణ 111వ చిత్రం. మొదట ఓ చారిత్రక కథతో తెరకెక్కించాలనుకున్నా, ఆ తర్వాత నిర్ణయాన్ని మార్చుకుని ఓ యాక్షన్ ప్రధానమైన కథతో సినిమాని పట్టాలెక్కించారు.

# ఆ పాటను తొలగించండి.. కఠిన చర్యలు తీసుకోండి: కేంద్రం ఆదేశం

'కేడీ: ది డెవిల్'లోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాట వివాదంలో చిక్కుకుంది. ధ్రువ్ సర్జా కథానాయకుడిగా నటించిన ఈ మూవీలో నోరా ఫతేహి, సంజయ్ దత్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా ఇందులో 'సర్కే చునార్..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. పాటలోని సాహిత్యం, నృత్యాలు అసభ్యంగా ఉన్నాయని వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల వేదికగా విపరీతమైన ట్రోలింగ్‌కు గురైంది. దీనిపై ఆలిండియా సినీ వర్కర్స్ అసోసియేషన్.. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన కేంద్రం అన్ని వేదికల్లోనూ పాటను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అధికార వర్గాన్ని ఆదేశించింది. సినిమాలు, మ్యూజిక్ వీడియోల్లో ఇలాంటి అసభ్యకర కంటెంట్ పునరావృతం కాకుండా పర్యవేక్షించాలని సూచించింది. పాన్ ఇండియా మూవీగా కేడీ ది డెవిల్'గా (KD The Devil) రూపొందింది. ఈ బహుభాషా చిత్రాన్ని ప్రేమ్ తెరకెక్కించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. రీష్మా కథానాయిక. సంజయ్ దత్, శిల్పా శెట్టి, నోరా ఫతేహి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. భారీ యాక్షన్ హంగామాతో సినిమా తీర్చిదిద్దినట్లు ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.



# శివకార్తికేయన్‌కు.. జోడీగా?



గ్లామర్‌కు నటన జోడించి కుర్రకారుని విశేషంగా ఆకట్టుకుంటోంది కథానాయిక భాగ్యశ్రీ బోర్సే. త్వరలోనే తెలుగులో అఖిల్ సరసన 'లెనిన్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్న ఈ తార.. తాజాగా ఓ తమిళ చిత్రంలో నటించనున్నట్లు తెలుస్తోంది. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'సెయాన్'. 'తాయ్ కిళవి' ఫేమ్ శివకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్ నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ సినిమాలో నాయిక ఎవరన్నది చిత్రబృందం ప్రకటించలేదు. అయితే ఇప్పుడిందులో మెరిసే తారల ఎంపికలో భాగ్యశ్రీ బోర్సే పేరు పరిశీలనలో ఉందట. ఇప్పటికే ఈ సినిమా కోసం చిత్రబృందం ఆమెను సంప్రదించినట్లు సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని సన్నిహిత వర్గాల సమాచారం.

# 'ధురంధర్2' రన్‌టైమ్.. ఇండియాలో ఇలా.. ఓవర్సీస్‌లో అలా!

: విడుదలకు ముందే 'ధురంధర్2' రికార్డులు సృష్టిస్తోంది. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్2: ది రివెంజ్'. సారా అర్జున్ కథానాయిక. మాధవన్, సంజయ్‌దత్, అర్జున్ రాంపాల్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒకరోజు ముందుగానే అంటే మార్చి 18న సాయంత్రం నుంచే ప్రీమియర్స్ మొదలు కాబోతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. సీబీఎఫ్‌సీ 'A' సర్టిఫికెట్ ఇచ్చింది. ఇండియాలో సినిమా రన్‌టైమ్‌ను 3 గంటలా 49 నిమిషాల 06 సెకన్లుగా ఖరారు చేసింది. ఓవర్సీస్‌లో మాత్రం అదనంగా మరో ఆరు నిమిషాలు ఎక్కువగా 3గంటలా 55 నిమిషాలతో సినిమాను ప్రదర్శిస్తున్నారు. మొదటి భాగం 3 గంటలా 34 నిమిషాలతో పోలిస్తే చాలా ఎక్కువే. ఇంటర్వెల్‌తో కలిపి దాదాపు నాలుగు



గంటలపైనే ప్రేక్షకుడు థియేటర్‌లో ఉండాలి. మరి సినిమాలో అంత బలమైన కంటెంట్ ఉందా? ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ ఆ అంచనాలను అందుకునేలా ఉంది.


# పిఠాపురంలో ప్రేమ పాట



మూడు ప్రేమకథలతో తెరకెక్కుతున్న చిత్రం 'పిఠాపురంలో'. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రలు పోషించారు. మహేష్‌చంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. దుండిగళ్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం.మురళి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'మక్కుళు మక్కుళు కాలేజూ...' అంటూ సాగే పాటని ఇటీవల హైదరాబాద్‌లో ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''చంద్రమహేశ్ నాకు ఇష్టమైన వ్యక్తి. ఆయన దగ్గరే 'చెప్పాలని ఉంది' చిత్రానికి సహ దర్శకుడిగా పనిచేశా. ఆయన మూడు విభిన్నమైన ప్రేమకథలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. పాట చాలా బాగుంది.

చిత్రం పెద్ద విజయాన్ని సొంతం చేసుకొంటుందని ఆశిస్తున్నా'' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''నా కెరీర్‌లో ఇదొక మంచి సినిమాగా నిలిచిపోతుంది. ఈ వారంలోనే ట్రైలర్‌ని, ఏప్రిల్‌లో చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు.

# ఒకరు కాదు.. ఇద్దరు!



అగ్ర కథానాయకుల సినిమాల్లోని ప్రత్యేక గీతాలపై ప్రేక్షకులు కనబరిచే ఆసక్తి అంతా ఇంతా కాదు. పాట ఎలా ఉంటుంది? అందులో కనిపించే హీరోయిన్ ఎవరు? స్టెప్పుల మాటేమిటి? అంటూ ఎన్నెన్నో ఆరాలు తీస్తుంటారు. ఆ ఆసక్తికి తగ్గట్టుగానే దర్శకనిర్మాతలు ఆ పాట కోసం ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకొంటూ ఉంటారు. మూడు నాలుగు నిమిషాల ఆ పాట కోసమే రూ.కోట్లు ఖర్చు చేస్తుంటారు. అగ్ర కథానాయికల్ని ఎంపిక చేస్తూ ప్రేక్షకుల్ని ఊరిస్తుంటారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాలోని ప్రత్యేక పాట కోసం కూడా అదే స్థాయిలో కసరత్తులు జరుగుతున్నట్టు తెలుస్తోంది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రత్యేక గీతానికి అవకాశం ఉండటంతో, దాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాలనే ప్రయత్నంలో ఉందట చిత్రబృందం. ఆ పాటలో రామ్‌చరణ్ సరసన ఆడిపాడేందుకు ఇద్దరు కథానాయికల్ని రంగంలోకి దింపనున్నట్టు సమాచారం. ఆ కథానాయికల ఎంపికపైనే ప్రస్తుతం చిత్రబృందం దృష్టిపెట్టినట్టు తెలుస్తోంది. వచ్చే నెలలో ఈ పాటని చిత్రీకరించనున్నట్టు సమాచారం.

# నటనపై ప్రేమతోనే అలా అడిగేదాన్ని .. మృణాల్ ఠాకూర్

**సరైన సమయం వచ్చినప్పుడు.. ఎంత కష్టమైనా పడి హిందీ, దక్షిణాది చిత్ర పరిశ్రమల్లో నా కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకోవాలనుకుంటున్నానని అంటోంది అందాల తార మృణాల్ ఠాకూర్. గుర్తుండిపోయే పాత్రల్ని ఎంచుకోవడంలో ముందు వరుసలో ఉండే నాయిక ఈమె. గతేడాది 'సన్ ఆఫ్ సర్దార్ 2'తో సందడి చేసిన మృణాల్.. 2025 కన్నా రెట్టింపు ఉత్సాహంతో ఈ సంవత్సరంలో సందడికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ తన సినీ కెరీర్ గురించి కొన్ని కబుర్లు పంచుకుంది.**


**భావోద్వేగాలే ముఖ్యం...** ''నేను కెరీర్ ప్రారంభించినప్పుడు.. ఇలా చేయాలి.. అలా చేయాలి అని నా ప్రణాళికలో చాలా విషయాలు ఉండేవి. కానీ అప్పుడు వాటికి అనుకూలమైన పరిస్థితులు లేవు. ఉత్తరాది, దక్షిణ చిత్రాల మధ్య కెరీర్‌ను బ్యాలెన్స్ చేస్తూనే ముందుకు వెళ్లాలనుకుంటున్నా. తమిళ పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టాలనే ఆలోచన ఉంది. చాలా కథలు వింటున్నాను. మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తున్నా. అయినా నాకు భాషతో అవసరం లేదు. భావోద్వేగాలే ముఖ్యం. ఉత్తమ కథలు దొరికినప్పుడు వివిధ భాషల్లో పని చేయాలని కోరుకుంటున్నా''.

**అవకాశాలను వెతకడం నేర్చుకున్నా...** ''చిత్రపరిశ్రమలోకి బయటి వ్యక్తిగా అడుగుపెట్టడం, అవకాశాలు అందుకోవడం సవాలుతో కూడుకున్న పని. బాలీవుడ్‌లో నా తొలినాళ్లు చాలా కష్టంగా గడిచాయి. కాలక్రమేణా.. ఆ అడ్డంకులను దాటుకొని నటిగా ఎదగడానికి అవకాశాలను ముందుగానే వెతకడం నేర్చుకున్నా. నేను నటించిన 'దో దీవానే సెహర్ మే' నా దగ్గరికి అలా వచ్చిన సినిమానే. ఈ చిత్ర దర్శకుడు రవి ఉద్యవార్‌ని నేరుగా సంప్రదించాను. 'మామ్' చూసిన తర్వాత 'నేను మీతో పనిచేయాలనుకుంటున్నా'నని చెప్పా. ఇలా చొరవ తీసుకొని అడగడం కొత్త కాదు. నిజానికి నేను పని కోసం సంప్రదించిన మొదటి దర్శకుడు ఆదిత్య ధర్. అవకాశాలు నాకంత తేలికగా రాలేదు. వాటిని సృష్టించుకోవాలి. వెంబడించాలి. దర్శకులు నా ముఖం చూసేలా చేసుకోవాలి. అయినా ఇలాంటి పనులు చేయడానికి నేను సిగ్గుపడను. నటనంటే అమితమైన ప్రేమ కాబట్టి ఎలాంటి సంకోచం లేకుండా అవకాశాల కోసం అడిగేదాన్ని''.

**ఏం జరుగుతుందో చూద్దాం...** ''ప్రస్తుతం డేవిడ్ ధావన్ దర్శకత్వం వహిస్తున్న 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'లో నటిస్తున్నా. ఒక పార్టీ లాంటి చిత్రమిది. మరోవైపు అట్లీఅల్లు అర్జున్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రంలో నేను నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తల వస్తున్నాయి. కానీ ఏం జరుగుతుందో చూడాలి. 'పుష్ప' చిత్రాలు చూసిన తర్వాత అల్లు అర్జున్ నటించిన అన్ని సినిమాలు, డ్యాన్స్, రిథమ్ చూసి ఆయనకి.. పెద్ద అభిమానిని అయ్యాను. ఆయనతో రెండుసార్లు మాట్లాడా. చాలా తెలివైనవారు''.



# మరిన్ని టెస్టులు... మరింత మెరుగు



న్యూఢిల్లీ: మహిళల క్రికెట్‌లోనూ క్రమం తప్పకుండా టెస్టు మ్యాచ్‌లు జరిగితేనే జట్టు మెరుగవుతుందని భారత బ్యాటర్ ప్రతీక రావల్ చెప్పింది. ఇటీవల ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన ఏకైక డే అండ్ నైట్ పింక్ బాల్ టెస్టులో ఆమె అర్ధసెంచరీతో ఆకట్టుకుంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఓడిపోయింది. ఈ నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ సంప్రదాయ టెస్టు క్రికెట్‌నే అందమైన ఫార్మాట్‌గా అభివర్ణించింది. పరిపూర్ణ క్రికెటర్ అయ్యేందుకు పరీక్ష పెడుతుందని చెప్పుకొచ్చింది. పురుషుల విభాగంతో పోలిస్తే మహిళల క్రికెట్‌లో టెస్టు మ్యాచ్‌లు అరుదుగా జరుగుతున్నాయి. 1976లో తొలి టెస్టు ఆడిన భారత మహిళల జట్టు 2026 వరకు మొత్తం 42 టెస్టుల్లో మాత్రమే పోటీపడింది. ఇందులో 8 టెస్టుల్లో గెలిచి, 7 టెస్టుల్లో ఓడిపోయింది. 27 టెస్టులను 'డ్రా'గా ముగించింది. న్యూఢిల్లీలో జాతీయ క్రీడా పాత్రికేయుల సమాఖ్య కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న 25 ఏళ్ల ప్రతీక ఈ సందర్భంగా చెప్పిన కబుర్లు ఆమె మాటల్లోనే...

**జగజ్జేతలుగా నిలవడం**

వన్డే ప్రపంచకప్ విజేతగా నిలవడం అన్నింటికంటే మించిన అద్భుతమైన అనుభవం. నా కెరీర్‌లో అదెప్పటికీ చిరస్మరణీయంగానే ఉంటుంది. ఇన్ని రోజులైనా... ఆ విజయం, కప్ ఎత్తుకున్న మా బృందం చేసిన సందడి, సంబరం కళ్లముందు కదలాడుతూనే ఉంది. బహుశా ఎప్పటికీ ఇలానే ఉండిపోతుందేమో చెప్పలేను. ఎందుకంటే మేం గెలిచింది... ఎప్పుడూ తలచుకునే ప్రపంచకప్‌ను.

**అసలైన క్రికెట్ అదే**

క్రికెట్‌లో టెస్టే అసలైన ఫార్మాట్. చిన్నప్పుడు మా నాన్న, కోచ్ ఇదే విషయాన్ని చెప్పారు. ఈ సంప్రదాయ ఫార్మాటే ప్రధానమైందని, ఇందులో రాణిస్తేనే క్రికెట్‌లో రాటుదేలుతామని, తద్వారా ఆ ఫార్మాట్ మన అభిమాన ఆటగా మారుతుందన్నారు. ఇప్పుడు టెస్టు ఆడుతుంటే నాక్కూడా అదే అనుభవం కలిగింది.

**సచిన్, లారా వీడియోల్ని చూసి**

పరిమిత ఓవర్ల క్రికెట్ పూర్తి భిన్నమైంది టెస్టు ఫార్మాట్. అందుకే ఈ సంప్రదాయ ఆటను ఒంటబట్టించుకునేందుకు దిగ్గజాలు ఆడిన తీరును అదే పనిగా చూశాను. టెస్టుల్లో సచిన్ టెండూల్కర్, రికీ పాంటింగ్ (ఆస్ట్రేలియా), వివియన్ రిచర్డ్స్, బ్రియాన్ లారా (వెస్టిండీస్)లు ఎలా ఆడారో తదేకంగా చూసేదాన్ని. గంటల తరబడి క్రీజులో నిలబడిన వారి బ్యాటింగ్ నాకు ప్రేరణగా ఉపయోగపడింది. నా ఆటకు ఉత్ప్రేరకంగా పనిచేసింది.

**ఈ ఏడాది కీలకం**

అమ్మాయిల జట్టుకు ఈ సీజన్ అత్యంత కీలకం. ఈ ఏడాది మహిళల టి20 ప్రపంచకప్‌తో పాటు ఆసియా క్రీడలు కూడా జరగనున్నాయి. ఏషియాడ్‌లో కూడా టి20 ఫార్మాట్‌లోనే క్రికెట్ పోరు జరుగుతుంది. అందుకే ప్రస్తుతం జట్టు కోసం శ్రమించేందుకు, జట్టు విజయాల్లో భాగం కావాడమే లక్ష్యంగా నేను కసరత్తు చేస్తున్నాను. అంతేతప్ప భవిష్యత్తుపై అదేపనిగా అతిగా ఆలోచించను.

**గుర్తింపే కదా ఎవరైనా ఆశించేది**

బీసీసీఐ వార్షిక నమన్ అవార్డుల్లో పాలుపంచుకోవడం చాలా ఆనందంగా ఉంది. నాకు ఇదే తొలి వేడుక (బోర్డుకు సంబంధించి). ఎక్కడైనా... ఎవరైనా కోరుకునేది గుర్తింపునే. మన శ్రమను గుర్తించి ఇచ్చే అవార్డులు మనల్ని మరింత కష్టపడేందుకు దోహదపడతాయి. మనదేశంలో కొన్నేళ్లుగా మహిళల క్రికెట్ కూడా పురుషుల క్రికెట్‌లా దూసుకెళుతోంది.

# ఈ సారి 300 ఖాయమేనా?



63/5.. 2013 ఐపీఎల్‌లో బెంగళూరు రాయల్ ఛాలెంజర్స్ సాధించిన స్కోరు. అవే అప్పటికి ఐపీఎల్‌లో ఓ జట్టు సాధించిన అత్యధిక పరుగులు. ఇంకో పన్నెండేళ్ల పాటు ఆ రికార్డు చెక్కుచెదరకుండా నిలిచింది. కానీ గత రెండు సీజన్లలో దీన్ని మించిన స్కోర్లు ఏకంగా ఆరు నమోదయ్యాయి. ఈసారి ఏకంగా 300 స్కోరు ఘనత కూడా సాధ్యమైతే ఆశ్చర్యమేమీ లేదు. 2024 సీజన్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆట ఒక సంచలనం. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ లాంటి విధ్వంసకారులతో కూడిన ఆ జట్టు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీతో మ్యాచ్‌లో 3 వికెట్ల నష్టానికి ఏకంగా 287 పరుగులు చేసింది. ఇప్పటికీ అదే ఐపీఎల్ రికార్డు స్కోరు. అప్పటిదాకా ఉన్న అత్యధిక స్కోరు రికార్డును మించి ఆ సీజన్లో నాలుగు స్కోర్లు నమోదైతే అందులో మూడు సన్‌రైజర్స్ ఖాతాలోకే చేరాయి. గత సీజన్లో కూడా ఆ జట్టు రాజస్థాన్‌పై 286/6, కోల్‌కతాపై 278/3 స్కోర్లు నమోదు చేసింది. వీటితో పాటు నాలుగో (277/3, ముంబయిపై 2024లో), ఆరో (266/7, దిల్లీపై 2024లో) అత్యధిక స్కోరు ఘనతలు కూడా ఆ జట్టువే. 2024లో దిల్లీపై 272/7తో కోల్‌కతా సాధించిన స్కోరు అయిదో అత్యధికం. ఈ గణాంకాలు చూస్తే గత రెండేళ్లలో ఐపీఎల్‌లో ఎలా పరుగుల పంట పండిందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా సన్‌రైజర్స్ దూకుడైతే మామూలుగా లేదు. నిరుడు ఆ జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోయినా.. రెండు మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు సాధించింది. హెడ్, అభిషేక్, క్లాసెన్‌లకు తోడు సూపర్ ఫామ్‌లో ఉన్న ఇషాన్ కిషన్ రెచ్చిపోతే.. ఈసారి సన్‌రైజర్స్ 300 మార్కును అందుకునే అవకాశాలను కొట్టిపారేయలేం. బ్యాటింగ్‌కు స్వర్గధామంగా ఉండే హైదరాబాద్, బెంగళూరు, ముంబయి మైదానాల్లో తమకు కలిసొచ్చిన రోజు.. సన్‌రైజర్స్ బ్యాటర్లు రికార్డుల మోత మోగించేస్తారనడంలో సందేహం లేదు. లఖ్‌నవూ, చెన్నై మినహాయిస్తే.. దాదాపుగా అన్ని మైదానాలూ బ్యాటింగ్‌కు పూర్తి అనుకూలంగా ఉంటాయి. కాబట్టి బ్యాటర్లకు పండగన్నట్లే. 14 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ గత ఏడాదిగా ఎలా చెలరేగిపోతున్నాడో తెలిసిందే. అతడి దూకుడు చూస్తే.. టీ20ల్లో డబుల్ సెంచరీ ఘనతను అందుకునేట్లే కనిపిస్తున్నాడు. ఆయుష్ మాత్రే, ఉర్విల్ పటేల్, ప్రియాంశ్ ఆర్య లాంటి భారత యువ బ్యాటర్లు.. లువాన్ ప్రిటోరియస్, డెవాల్డ్ బ్రెవిస్ లాంటి విదేశీ కుర్రాళ్ల దూకుడు ఎలాంటిదో ఐపీఎల్ అభిమానులు ఇప్పటికే రుచి చూశారు. సన్‌రైజర్స్ మాత్రమే కాక.. అన్ని జట్లూ బ్యాటింగ్‌లో బలంగానే కనిపిస్తున్నాయి. ప్రతి సీజన్లోనూ బ్యాట్ బలాన్ని పెంచుకునే ప్రయత్నమే చేస్తున్నాయి. పిచ్‌లు కూడా మరింత బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతున్నాయి. బ్యాటర్లు కూడా ఇంకా ఇంకా విధ్వంసకరంగా ఆడే ప్రయత్నం చేస్తున్నారు. షాట్లు రూపాంతరం చెందుతున్నాయి. రేంజ్ హిట్టింగ్ లాంటి కొత్త పద్ధతులతో మరింత రాటుదేలుతున్న బ్యాటర్లు.. బౌలర్లను నిర్దాక్షిణ్యంగా బాదేస్తున్నారు. కాబట్టి ఈ సీజన్లో 300 ఘనతకు అవకాశాలు పుష్కలంగానే కనిపిస్తున్నాయి.

# ఒకే గ్రూప్‌లో భారత్, పాకిస్తాన్



లుసానే (స్విట్జర్లాండ్): హాకీ వరల్డ్ కప్‌లో పాల్గొనే జట్ల గ్రూప్‌ల వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) వెల్లడించింది. రెండు ఒలింపిక్ స్వర్ణాలు, రెండు ప్రపంచకప్ విజయాల్లో భాగంగా ఉన్న డచ్ హాకీ క్రీడాకారిణి నవోమీ వాన్ ఆజ్ సహా పలువురు మాజీ ఆటగాళ్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పురుషుల విభాగంలో, మహిళల విభాగంలో ఒకేసారి ప్రపంచకప్‌లను నిర్వహిస్తుండటం విశేషం. బెల్జియం, నెదర్లాండ్స్‌లలో ఆగస్టు 14 నుంచి 30 వరకు పోటీలు జరుగుతాయి. రెండు మెగా టోర్నీలకు సంబంధించిన వేర్వేరు మస్కట్‌లను కూడా ఎఫ్ఐహెచ్ విడుదల చేసింది. వరల్డ్ కప్‌లో మొత్తం 16 జట్లు చొప్పున పాల్గొంటున్నాయి. ఒక్కో పూల్ నుంచి టాప్–2 జట్లు ముందంజ వేస్తాయి. ఎనిమిది టీమ్‌లతో రెండో దశ నిర్వహిస్తారు. ఆ తర్వాత నాకౌట్ మ్యాచ్‌లు ఉంటాయి. పురుషుల విభాగంలో పూల్ 'డి'లో భారత్ బరిలోకి దిగుతోంది. ఈ పూల్‌లో భారత్‌తో పాటు పాకిస్తాన్, ఇంగ్లండ్, వేల్స్ జట్లు ఉన్నాయి. మహిళల విభాగంలో భారత్ పూల్ 'డి'లో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, చైనాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. టోర్నమెంట్ మ్యాచ్‌ల పూర్తిస్థాయి షెడ్యూల్‌ను నేడు ప్రకటిస్తారు. 2022లో జరిగిన వరల్డ్ కప్‌లో జర్మనీ, నెదర్లాండ్స్ పురుషుల, మహిళల విభాగాల్లో విజేతలుగా నిలిచాయి.

**పూల్‌ల వివరాలు**

**పురుషుల విభాగం:**

పూల్ 'ఎ': నెదర్లాండ్స్, అర్జెంటీనా, న్యూజిలాండ్, జపాన్; పూల్ 'బి': బెల్జియం, జర్మనీ, ఫ్రాన్స్, మలేసియా; పూల్ 'సి': ఆస్ట్రేలియా, స్పెయిన్, ఐర్లాండ్, దక్షిణాఫ్రికా; పూల్ 'డి': భారత్, పాకిస్తాన్, ఇంగ్లండ్, వేల్స్.

**మహిళల విభాగం:** పూల్ 'ఎ': నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, చిలీ, జపాన్; పూల్ 'బి': అర్జెంటీనా, జర్మనీ, అమెరికా, స్కాట్లాండ్; పూల్ 'సి': బెల్జియం, స్పెయిన్, న్యూజిలాండ్, ఐర్లాండ్; పూల్ 'డి': భారత్, ఇంగ్లండ్, చైనా, దక్షిణాఫ్రికా.

## 80శాతం చదువులో రాలేదు కానీ..



దిల్లీ: చదువులో సాధ్యం కాకున్నా మైదానంలో 80 శాతం స్కోర్ చేయగలిగానని టీమ్ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. సూర్య కెప్టెన్‌గా 80 గెలుపు శాతాన్ని కలిగి ఉన్నాడు. అతడి సారథ్యంలో టీమ్ఇండియా 52 టీ20 మ్యాచ్‌ల్లో 42 గెలిచింది. ఈ నేపథ్యంలో సూర్య మాట్లాడుతూ.. "బడిలో, కళాశాలలో బాగా చదివి ఆ శాతాన్ని తెచ్చుకోవడానికి ప్రయత్నించా. అదిప్పుడు క్రికెట్లో వచ్చింది. బడిలో, కళాశాలలో నేనెప్పుడూ 5060 శాతం దాటలేదు. కానీ క్రికెట్లో 80 శాతం సాధించినందుకు సంతోషంగా ఉంది. నేను గణాంకాలకు పెద్దగా ప్రాధాన్యమివ్వను. కానీ ఎవ్వరూ మ్యాచ్ ఓడిపోవడాన్ని ఇష్టపడరు. ప్రతీది గెలవాలనుకుంటారు" అని సూర్యకుమార్ చెప్పాడు. తనను చదివించడానికి తన కుటుంబం ఎంతో ప్రయత్నించిందని, కానీ తనకు చదువు మీద ఆసక్తి లేదన్న విషయం వాళ్లకు త్వరగానే అర్థమైందని అన్నాడు. అయితే క్రికెట్లో వాళ్ల మద్దతు తనకెప్పుడూ ఉందని సూర్య చెప్పాడు.

## హర్షిత్ చాలా మ్యాచ్‌లకు..



కోల్‌కతా: ఐపీఎల్ ఆరంభం కాకముందే కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన బౌలర్ హర్షిత్ రాణా గాయంతో చాలా మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాతో వార్మప్ మ్యాచ్‌లో హర్షిత్ కుడి మోకాలికి గాయమైంది. శస్త్ర చికిత్స జరగడంతో అతడు కోలుకునే ప్రక్రియలో ఉన్నాడు. అతడు ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోతే కోల్‌కతాకు ఇబ్బందే. సీఎస్కే నుంచి కేకేఆర్‌కు మారిన శ్రీలంక పేసర్ పతిరనకు ప్రపంచకప్‌లో గాయం అయింది. అతడు ఎన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడో తెలియదు. ముస్తాఫిజుర్ రెహ్మాన్ స్థానంలో వచ్చిన జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానిపైనే కేకేఆర్ ఆశలు పెట్టుకుంది. ఈ నెల 29న తన తొలి మ్యాచ్‌లో ముంబయితో కేకేఆర్ తలపడనుంది.

## రోహిత్ కొత్తగా కనిపిస్తున్నాడు: మహేల జయవర్ధనే



ముంబయి: మరింత ఫిట్‌గా మారిన రోహిత్ శర్మ.. ఐపీఎల్ నేపథ్యంలో నైపుణ్యాలపై దృష్టిపెట్టాడని ముంబయి ఇండియన్స్ ప్రధాన కోచ్ మహేల జయవర్ధనే చెప్పాడు. "శిక్షణ శిబిరం తొలి రోజే రోహిత్ మాతో చేరాడు. నెట్స్‌లో చాలా బాగా ఆడాడు. రోహిత్ కొత్తగా కనిపిస్తున్నాడు. చాలా ఫిట్‌గా ఉన్నాడు. ఐపీఎల్‌లో అతడు చెలరేగుతాడని ఆశిస్తున్నా" అని చెప్పాడు. టీమ్ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ తన ఫామ్ గురించి ఆందోళన చెందట్లేదని జయవర్ధనే అన్నాడు. అతడు జట్టుకు అవసరమైనప్పుడు ఆడాడని చెప్పాడు. "నిలకడ విషయంలో మెరుగుపడాలని సూర్య భావిస్తాడనడంలో సందేహం లేదు. కానీ అతడు జట్టును గొప్పగా నడిపించాడు" అని అన్నాడు. సూర్య కాస్త విశ్రాంతి తీసుకున్నాక శిబిరంలో చేరతాడని జయవర్ధనే తెలిపాడు. భారత మహిళల జట్టు వన్డే ప్రపంచకప్ గెలవడం, పురుషుల జట్టు టీ20 ప్రపంచకప్ నెగ్గడం ఓ తరానికి ప్రేరణనిచ్చిందనడంలో సందేహం లేదని మహేల అన్నాడు. రోహిత్, హార్దిక్, సూర్య, తిలక్, బుమ్రా వంటి ఆటగాళ్లు ముంబయి జట్టులో ఉన్నందుకు గర్వంగా ఉందని చెప్పాడు.

## ఆడేకొద్దీ మెరుగవుతాం



దిల్లీ: టెస్టు మ్యాచ్‌లు ఆడేకొద్దీ ఈ ఫార్మాట్లో భారత జట్టు మెరుగవుతుందని యువ ఓపెనర్ ప్రతీక రావల్ చెప్పింది. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన ఏకైక టెస్టు (డే/నైట్)లో భారత అమ్మాయిలు ఓటమి పాలవగా.. ఈ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో ప్రతీక అర్ధశతకం (63)తో జట్టుకు ఇన్నింగ్స్ ఓటమి తప్పించింది. ఈ నేపథ్యంలో ప్రతీక మాట్లాడుతూ.. "టెస్టు క్రికెట్ అత్యంత అందమైన ఫార్మాట్. చిన్నప్పటి నుంచి నాన్న, కోచ్ టెస్టులు ఎంత ముఖ్యమో చెబుతూ వచ్చారు. అలా చెప్పినపుడు మనకు అదే అత్యంత ఇష్టమైన ఫార్మాట్ అవుతుంది. సచిన్, రిచర్డ్స్, లారా, పాంటింగ్ లాంటి బ్యాటర్ల వీడియోలు చూసి నేను స్ఫూర్తి పొందా. మేం ఎక్కువ టెస్టులు ఆడేకొద్దీ ఈ ఫార్మాట్లో మెరుగవుతాం. టెస్టు అనుభవమే క్రికెటర్లను రాటుదేలుస్తుంది. వ్యక్తిగతంగా కూడా ఎదుగుతారు" అని చెప్పింది.